

కుంభమేళాలో భాగంగా ప్రయాగ్‌రాజ్‌లోని త్రివేణి సంఘం వద్ద పుణ్యస్నానం ఆచరిస్తున్న రిలయన్స్ చైర్మన్ ముకేశ్ అంబానీ కుటుంబ సభ్యులు

# కుప్పకూలిన స్టాక్ మార్కెట్లు

## వరుసగా ఐదోరోజూ నష్టపోయిన సూచీలు • సెన్సెక్స్ 1,018, నిఫ్టీ 667 పాయింట్ల నష్టం




ముంబై, ఫిబ్రవరి 11: దేశీయ స్టాక్ మార్కెట్లు కుప్పకూలుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన ప్రతికూల సంకేతాలతో మదుపరులు అమ్మకాలకు మొగ్గుచూపడంతో వరుసగా ఐదోరోజూ సూచీలు భారీగా నష్టపోయాయి. స్టీల్, అల్యూమినియం దిగుమతులపై 25 శాతం సుంకం విధించడంతోపాటు తమపై సుంకాలు విధిస్తున్న దేశాలపై ప్రతీకార సుంకాలు విధించనున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించడంతో సూచీలు తీవ్ర ఒత్తిడికి గురయ్యాయి. మరోసారి ప్రపంచ దేశాల మధ్య వాణిజ్య యుద్ధమేఘాలు కమ్ముకుంటుండటం దేశీయ సూచీలు అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. మంగళవారం కూడా 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ ఇంట్రాడేలో 1,200 పాయింట్లకు పైగా నష్టపోయి రెండు వారాల కనిష్ఠ స్థాయికి జారుకున్నది. చివరకు మార్కెట్ ముగిసే సమయానికి సూచీ 1,018 పాయింట్లు లేదా 1.32 శాతం కోల్పోయి 77 వేల పాయింట్ల దిగువకు 76,293.60 పాయింట్ల వద్ద స్థిరపడింది. మరో సూచీ నిఫ్టీ 23 వేల పాయింట్ల దిగువకు జారుకున్నది. చివరకు 309.80 పాయింట్లు లేదా 1.32 శాతం కోల్పోయి 23,071.80 వద్ద ముగిసింది. అమెరికా వాణిజ్య విధానాలు, సుంకాల చుట్టూ కొనసాగిన అనిశ్చిత పరిస్థితికి తోడు దేశీయ ఆర్థిక పరిస్థితులు అంతంత మాత్రంగానే ఉండటం కూడా మార్కెట్ల పతనానికి ఆజ్యం పోశాయని జియోజిట్ ఫైనాన్షియల్ సర్వీసెస్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు. చిన్న, మధ్యతరహా సూచీలు అత్యధికంగా నష్టపోయాయన్నారు. జొమాటో షేరు పతనం కొనసాగుతున్నది. మంగళవారం కూడా కంపెనీ షేరు 5 శాతం నష్టపోయి టాప్ లూజర్‌గా నిలిచింది. దీంతోపాటు టాటా స్టీల్, బజాజ్ ఫిన్‌సర్వ్, పవర్ గ్రిడ్, లార్సెన్ అండ్ టుబ్రో, టాటా మోటర్స్, కొటక్ మహీంద్రా బ్యాంక్, హెచ్‌యూఎల్, ఐటీసీలు అత్యధికంగా నష్టపోయాయి. కేవలం భారతీ ఎయిర్‌టెల్ మాత్రమే నష్టపోయింది. రంగాలవారీగా చూస్తే రియల్టీ అత్యధికంగా 3.14 శాతం నష్టపోయి టాప్ లూజర్‌గా నిలిచింది. దీంతోపాటు కన్స్యూమర్, క్యాపిటల్ గూడ్స్, ఆటో, మెటల్ రంగ సూచీలు కూడా రెండు శాతం వరకు కోల్పోయాయి.

### పతనానికి కారణాలు

- స్టీల్, అల్యూమినియంపై టారిఫ్ విధించడంతోపాటు రానున్న రోజుల్లో తమపై సుంకాలు విధిస్తున్న దేశాలపై ప్రతీకార సుంకాలు విధించనున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించడం
- విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు నిధుల తరలింపు కొనసాగుతుండటం
- కార్పొరేట్ల నిరుత్సాహక ఆర్థిక ఫలితాలు
- దేశ ఆర్థిక వ్యవస్థ ఆశించిన స్థాయిలో వృద్ధిని నమోదు చేసుకోలేకపోవడం.

### 17 లక్షల కోట్ల సంపద ఆవిరి

మదుపరులకు నిరాశే మిగులుతున్నది. దేశీయ ఈక్విటీ మార్కెట్లో చిన్న, పెద్ద మొత్తంలో ఇన్వెస్ట్ చేసిన వారికి సూచీల పతనం వారికి గుబులురేపుతున్నది. గడిచిన ఐదు రోజులుగా సూచీలు పతనం చెందడంతో మదుపరులు రూ.17 లక్షల కోట్ల సంపదను కోల్పోయారు. అంతర్జాతీయంగా స్టాక్ మా ర్కెట్లు భారీగా పతనం చెందడం, ఎఫ్ఐఐలు భారీగా నిధులను తరలించుకుపోవడం, అమెరికా టారిఫ్ యుద్ధానికి తెరలేపడం వంటి కారణాలు మార్కెట్ సెంటిమెంట్‌ను నిరాశపరిచాయి. గత ఐదు సెషన్లలో సెన్సెక్స్ 2,290.21 పాయింట్లు లేదా 2.91 శాతం నష్టపోయింది. దీంతో బీఎస్ఈలో లిస్టైన కంపెనీల మార్కెట్ విలువ రూ.16,97,903.48 కోట్లు కరిగిపోయి రూ.4,08,52,922.63 కోట్ల(4.70 ట్రిలియన్ డాలర్లు)కు పడిపోయింది. మంగళవారం ఒకేరోజు మదుపరులు రూ.9,29,651.16 కోట్ల సంపదను కోల్పోయారు.



### బాలెనో మరింత ప్రియం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11: ఇప్పటికే పలు మాడళ్ల ధరలను పెంచిన కార్ల తయారీలో అగ్రగామి సంస్థ మారుతి .. తాజాగా మరో మాడల్ ధరను సవరించింది. దేశీయంగా అత్యంత ప్రజాదరణ పొందిన హ్యాచ్‌బ్యాక్ మాడల్ బాలెనో ధరను రూ.9 వేల వరకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నది. ప్రస్తుత బాలెనో రూ.6.70 లక్షలు మొదలుకొని రూ.9.92 లక్షల లోపు ధరతో ఈ మాడల్ లభిస్తున్నది. దీంట్లో పెట్రోల్ మాడల్ 22.35 కిలోమీటర్ల మైలేజీ ఇవ్వనుండగా, సీఎన్‌జీ కిలోకు 30.61 కిలోమీటర్లు ఇవ్వనున్నది. డెల్టా ఏజీఎస్, జెటా ఏజీఎస్, ఆల్ఫా ఏజీఎస్ రకం రూ.9 వేల వరకు పెరగనుండగా, ఇతర మాడళ్లు రూ.4 వేలు అధికంకానున్నది. టాటా అల్ట్రోజ్, హ్యుందాయ్ ఐ20లకు పోటీగా సంస్థ ఈ మాడల్‌ను ప్రవేశపెట్టింది.

### ఎంటార్ ఆశాజనకం

హైదరాబాద్, ఫిబ్రవరి 11: క్షిపణుల తయారీలో కీలక విడిభాగాల తయారీ సంస్థ ఎంటార్ ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికం(అక్టోబర్ నుంచి డిసెంబర్ మధ్యకాలంలో) రూ.16 కోట్ల పన్నులు చెల్లించిన తర్వాత నికర లాభాన్ని గడించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.10.4 కోట్లతో పోలిస్తే 52.8 శాతం ఎగబాకినట్లు వెల్లడించింది. అలాగే సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం రూ.118.4 కోట్ల నుంచి నుంచి రూ.174.50 కోట్లకు ఎగబాకింది. ఈ సందర్భంగా కంపెనీ ఎండీ, ప్రమోటర్ పర్వత్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ..క్లీన్ ఎనర్జీ, ఏరోస్పేస్ రంగాల నుంచి రూ.400 కోట్ల విలువైన ఆర్డర్లు వచ్చాయని, దీంతో ఆర్డర్ల బుకింగ్ మరింత పెరిగిందన్నారు. భవిష్యత్తులో న్యూక్లియర్ రంగం నుంచి కూడా ఆర్డర్లు వచ్చే అవకాశం కూడా ఉన్నదన్నారు.

### హాట్‌కేక్‌లా హైదరాబాద్ ఆఫీస్ స్థలం

#### 2030 నాటికి 200 మిలియన్ల చదరపు అడుగుల డిమాండ్

హైదరాబాద్, ఫిబ్రవరి 11: హైదరాబాద్‌లో ఆఫీస్ స్థలాలకు గిరాకీ నెలకొన్నది. 2030 నాటికి నగరంలో 200 మిలియన్ల చదరపు అడుగుల విస్తీర్ణం కలిగిన ఆఫీస్ స్థలాలకు డిమాండ్ ఉండనున్నట్లు ప్రముఖ రియల్ ఎస్టేట్ కన్సల్టెన్స్, హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ ఎంటర్‌ప్రైజెస్ అసోసియేషన్(హైసియా) సంయుక్తంగా విడుదల చేసిన నివేదికలో వెల్లడించాయి. దేశవ్యాప్తంగా ఆఫీస్ స్థలానికి ఉన్న డిమాండ్‌లో ఒక హైదరాబాద్ నగరం వాటా 15 శాతంగా ఉన్నదని తెలిపింది. టెక్నాలజీ హబ్‌గా కొనసాగుతున్న హైదరాబాద్‌లో కార్యాలయాలు ఏర్పాటు చేయడానికి అంతర్జాతీయ సంస్థలు ఆసక్తి చూపుతున్నాయని, దీంతో ఇక్కడ ఆఫీస్ స్థలాలకు గిరాకీ పెరుగుతున్నదని వెల్లడించింది. 2014 నుంచి డిసెంబర్ 2024 నాటికి నగరంలో ఆఫీస్ స్థలాలు మూడింతలు డిమాండ్ పెరిగి 137 మిలియన్ల చదరపు అడుగులకు చేరుకున్నదని సీబీఆర్‌ఈ చైర్మన్, సీఈవో అన్షుమన్ మ్యాగజైన్ తెలిపారు. నగరంలో మౌలిక సదుపాయాలు అంతకంతకు పెరగడం, అలాగే ప్రతిభ కలిగిన ఉద్యోగులు లభించడం, ఐటీ/ఐటీఈఎస్ ఎకోసిస్టమ్, జీసీసీల ఏర్పాటునకు హైదరాబాద్ అనువుగా ఉండటం, బీఎఫ్ఎస్ఐ, లైఫ్ సైన్సెస్ అడ్డాగా కొనసాగుతుండటం కూడా మరో కారణమని చెప్పారు.

### 18 లక్షల కోట్లకు పన్ను వసూళ్లు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11: నికర ప్రత్యక్ష పన్ను వసూళ్లు అంతకంతకు పెరుగుతున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు రూ.17.78 లక్షల కోట్ల నికర ప్రత్యక్ష పన్ను వసూలైనట్లు కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు వెల్లడించింది. క్రితం ఏడాది ఇదే సమయంలో వసూలైనదాంతో పోలిస్తే 15 శాతం అధికమని పేర్కొంది. దీంట్లో వ్యక్తిగత ఆదాయ పన్ను వసూళ్లు ఏడాది ప్రాతిపదికన 21 శాతం ఎగబాకి రూ.9.48 లక్షల కోట్లకు చేరుకోగా, నికర కార్పొరేట్ ట్యాక్స్ వసూళ్లు 6 శాతం అధికమై రూ.7.78 లక్షల కోట్లకు చేరుకున్నాయి. అలాగే సెక్యూరిటీస్ ట్రాన్సక్షన్ ట్యాక్స్ 65 శాతం అధికమై రూ.49,201 కోట్లకు చేరాయి.

### నైపుణ్య శిక్షణలో బహ్రెయిన్‌కు సహకరిస్తాం

#### రాష్ట్ర ఐటీ మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్, ఫిబ్రవరి 11(నమస్తే తెలంగాణ): స్కిల్ యూనివర్సిటీ, అంకుర సంస్థల ఆవిష్కరణ కేంద్రంగా ఉన్న టీ హబ్, టీ వర్క్స్ లాంటి సంస్థల ను బహ్రెయిన్‌లో ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వపరంగా సంపూర్ణ సహకారం అందిస్తామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశ రాయబారికి హామీ ఇచ్చారు. మంగళవారం సచివాలయంలో తనను కలిసిన బహ్రెయిన్ రాయబారి అబ్దుల్ రహమాన్ అల్ గావుద్, బహ్రెయిన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులతో మంత్రి ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణా ప్రభుత్వం సహకరిస్తే ఆ రెండు సంస్థలలాంటివి తమ దేశంలో కూడా ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్టు బహ్రెయిన్ ప్రతినిధుల బృందం మంత్రిని కోరింది. తాము ఏర్పాటు చేసిన స్కిల్ యూనివర్సిటీని పరిశ్రమలే నిర్వహించి తమకు అవసరమైన నైపుణ్యంలో యువతకు శిక్షణ కూడా ఇవ్వనున్నట్టు శ్రీధర్ బాబు వారికి తెలిపారు.

### మిడ్‌వెస్ట్ ఐపీవోకి సెబీ గ్రీన్‌సిగ్నల్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11: బ్లాక్ గెలాక్సీ గ్రానైట్ ఉత్పత్తిలో అగ్రగామి హైదరాబాదీ సంస్థ మిడ్‌వెస్ట్ ఐపీవోకి మార్కెట్ నియంత్రణ మండలి సెబీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ వాటా విక్రయంలో భాగంగా తాజా షేర్లను విక్రయించడంతో రూ.250 కోట్ల నిధులు, ప్రమోటర్లకు చెందిన షేర్లను ఆఫర్ ఫర్ సేల్ రూట్‌లో విక్రయించడంద్వారా రూ.400 కోట్ల నిధులను సమీకరించాలనుకుంటున్న. ఆఫర్ ఫర్ సేల్ రూట్‌లో షేర్లను విక్రయించడం ద్వారా కోల్లారెడ్డి రామ రాఘవ రెడ్డికి రూ.360 కోట్లు, గుంటక రవీంద్ర రెడ్డికి రూ.40 కోట్ల నిధులు సమకూరనున్నాయి.

### కృత్రిమమేధస్సుకు భారతీయులు సై

#### ఈ టెక్నాలజీని వినియోగిస్తున్న 65 శాతం మంది

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11: టెక్నాలజీ రంగంలో రోజుకొక వినూత్న మార్పులు జరుగుతుంటాయి. ఇటీవలకాలంలో అత్యంత ప్రజాదరణ పొందిన కృత్రిమ మేధస్సు(ఏఐ) టెక్నాలజీ వాడకంలో భారతీయులు ముందువరుసలో నిలిచారు. దేశ జనాభాలో సగం కంటే అత్యధిక మంది ఈ టెక్నాలజీని వినియోగిస్తున్నారని మైక్రోసాఫ్ట్ విడుదల చేసిన సర్వేలో వెల్లడైంది. అంతర్జాతీయ దేశాల్లో వినియోగిస్తున్నవారికంటే ఇది రెండింతలు అధికంగా 65 శాతం మంది ఇండియన్స్ ఈ టెక్నాలజీని వినియోగిస్తున్నారని మంగళవారం మైక్రోసాఫ్ట్ విడుదల చేసిన గ్లోబల్ ఆన్‌లైన్ సేఫ్టీ సర్వేలో ఈ విషయం వెల్లడైంది. జూలై 19 నుంచి ఆగస్టు 9, 2024 మధ్యకాలంలో భారత్‌తోపాటు




ఇతర దేశాల్లో ఈ సర్వే నిర్వహించింది. ఈ సర్వేలో 15 వేల మంది యువతియువకులు, పెద్దలు పాల్గొన్నారు. వీరిలో 65 శాతం మంది ఏఐ టెక్నాలజీని వినియోగిస్తున్నామని, 2023 కంటే ఇది 26 శాతం అధికమని పేర్కొంది. అంతర్జాతీయ దేశాల్లో సరాసరిగా 31 శాతం మంది ఈ టెక్నాలజీని వాడుతున్నారు. ముఖ్యంగా దేశీయంగా ఈ టెక్నాలజీని అనువాదాలకు, ప్రశ్నల జవాబుల కోసం, మెరుగైన పనితీరు కనబర్చడానికి, స్కూల్‌వర్క్‌లో విద్యార్థులకు సహాయం అందించడానికి వినియోగిస్తున్నారు. ఏఐ టెక్నాలజీ వాడకంలో మిలియనీర్లు(25 నుంచి 44 ఏండ్లలోపువారు) 84 శాతం మంది ఉన్నారని పేర్కొంది. డిజిటల్ చాలెంజ్‌పై తల్లిదండ్రులకంటే తమ పిల్లలకు అవగాహణ అధికంగా ఉన్నదని, గడిచిన కొన్నేండ్లుగా ఇది మరింత పెరుగుతున్నదని తెలిపింది. అయినప్పటికీ అంతర్జాతీయ ట్రెండ్‌లను ప్రతిబింబించేలా ఆన్‌లైన్ దుర్వినియోగం, డీప్ ఫేక్‌లు, స్కామ్‌లపై ఈ నివేదిక ఆందోళన వ్యక్తంచేసింది. 18 ఏండ్ల కంటే తక్కువ వయస్సు కలిగిన యువకులు ఏఐ టెక్నాలజీని విపరీతంగా వాడేస్తున్నారని తెలిపింది.






Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.